# "అపోహ"

రచన: పిప్పళ జగన్‌మోహన్‌రావ్




క్రీన్ ఏడన్నర్థం హాయిగా ప్రేమకలాపాలు నరససల్లాపాలు జరిపి సతీమణిగా రిజిష్టర్ చేసుకున్నాడు తారని. వివాహమైన ఆరు వారాలకే ఉన్నతపదవిమీద బదిలీ అయింది మద్రాసుమహానగరానికి. అందరూ తార యొక్క 'తార' (నక్షత్రము) ను ప్రశంసించారు. ఖాళీ అయిన యిళ్ళు దొరకడం కూడ ఒక నిరుద్యోగ సమస్యగా తయారయింది ప్రతిమహానగరాల్లోను. ఆరురోజులు అళ్ళూ, విళ్ళూ అనకుండా ఆనవాలుపట్టిన ప్రతివారిని అడిగి 'చింతాద్రిపేటలో' ఓచిన్న యిల్లు సంపాదించాడు. ఈ ఆరురోజుల ఎడబాటుకు తట్టుకోలేక వెంటనే అత్తవారింటికి వెళ్లి వెంటబెట్టుకొచ్చాడు తారని. బండి దిగుతూనే—

"ఏవిటండీ! ఈ కొంప మద్రాసంటే యింతేనా" అని యీసడింపుగా అంది సతీమణి.

"నేను నీవు—నీవు నేను అయినా బాగుండేది మద్రాసు శికింద్రాబాదు ఎలా అవుతుందే" అన్నాడు తార చెవిలో. బండిలోంచి దింపిన సామాను సర్దుతున్న బంట్రోతు వింటాడేమోనని. బంట్రోతు యిది చూసి అమ్మ – అయ్యా సరసా లాడుకుంటున్నారని ఓరగాచూసి నవ్వుకుంటూ తప్పుకున్నాడు ఓ ప్రక్కకి.

"బాగుంది యింకెవరైనా చూసి ఏమిటో ఈ రహస్య మనుకునేరు" అంది మూతి మూడుసార్లు అటూ ఇటూ త్రిప్పుకొంటూ. వంటావిడ చేత్తో చారుగరిటిపట్టుకొని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఎప్పటినుంచి చూస్తూవుందో వీళ్ళ సరసం పాపం! తారకి ఆమెను చూడగానే సిగ్గు ముంచుకొచ్చింది. కొంటెగా కోఅచూపులు చూసింది నవ్వుతూ. అప్పుడు జ్ఞాపకమొచ్చి "ఆమె మన వంటావిడ సుబ్బమ్మగారు" అని పరిచయంచేశాడు కిరన్. "బాగుంది నేనెవరో ప్రక్కింటావిడను కుంటున్నాను. 'ఏమండీ సుబ్బమ్మగారూ వంట ఎంతవఅకు వచ్చిందండీ' అని అడిగింది.

"వంటా అంతా అయింది, వేడినీళ్ళు కావాను స్నానానికి రండమ్మా" అని మరుగుతున్న చారు కలపడానికి వెళ్లింది వంటావిడ.

త్వరలోనే వీళ్లు మద్రాసులో చాలమందితో పరిచయం చేసుకున్నారు. "Social Couple" అని పేరు రావడానికి ఎంతో కాలం పట్టలేదు. తార Women's Club కి సెక్రెట్రీగా ఎన్నిక అయింది. వీళ్ళు మద్రాసులో చూడవలసిన ప్రదేశాలన్నీ చూసారు. ప్రతిచోట కిరన్‌వద్దనున్న 'రోలీప్లెక్స్' కెమెరాతో ఫొటోలు తీసుకున్నారు. 'మోర్ మార్కెట్' 'చీనా బజార్' 'హైకోర్టు' వగైరాలన్నీ చూశారు. పార్కులు, బీచ్‌షికారు ప్రతి నిత్యమూ వెళ్లేవారు. సముద్రతీరమందు, నిర్జనప్రదేశంలో యిసుకతిన్నెలపై చల్లని వెన్నెలలో చక్కని మాటలుచెబుతూ ప్రపంచాన్నే మరచి కాలం వెళ్ళబుచ్చేవారు ఈ ప్రేమదంపతులు. ప్రతి క్రొత్త సినిమాకు మొదటిరోజే హాజర్. కాని తారమాత్రం ఆ యిల్లు కాళీచేయాలని యింతటి మహానగరంలోకూడ ఇలాంటి మురికికాల్వలు, ఇరుకు సందులు ఉన్నాయంటే మద్రాసు మునిసిపాలిటీకే తలవంపులని, సానిటరీ ఇన్స్‌పెక్టర్ అయిన కిరనే ఇటువంటి యిల్లు సెలక్టు చేసాడంటే అది తనకే Insult అని ప్రతిరోజు దెప్పిపొడుస్తుండేది. అతనికీ ఆ ఇంట్లో వుండాలని లేదు కాని పరిస్థితులు అనుకూలించనపుడు, పరిస్థితులకు అనుకూలంగా ప్రవర్తించాలని అలా నెట్టుకొస్తున్నాడు. ఇక ఆమెబాధ పడలేక కాస్త 'Strong' గా ప్రయత్నించడం మొదలెట్టాడు. కొద్ది రోజుల్లోనే చింతాద్రిపేటనుండి మకాం మార్చేసి మౌంటురోడ్డులోకి వచ్చారు.

ఆ రోజు శుక్రవారం. ఉదయమే లేచి తలంటుస్నానంచేసి (వంటావిడ సుబ్బమ్మగారికి ఆరోజు యే యే కూరలొండాలో చెప్పి) 'కాశ్మీర్'చీర ధరించి, లేత నీలిరంగు జాకెట్ తొడుక్కొని డ్రాయింగ్‌రూములో కూర్చొని కాటుకకండ్లతో మాగ్‌జిన్లుతిరగవేస్తుంది తార. ఆరోజు ఎందుకో ప్రతిదినంకన్నా ఎక్కువ సంతోషంగా వుంది. ఆమె ఆనందంగావున్న రోజు ఇంట్లో లక్ష్మి కళకళ లాడుతున్నట్లనిపిస్తుంది. ఏకాంతంగా సోఫాపై కూర్చొని జరిగిన సంఘటనలను నెమరు వేస్తుంది. ఒకొక్కటీ ఆమె స్మృతిపథంలోమెదిలి మాయమౌతున్నవి. తీయని స్మృతులతో ఆమె వళ్లు పులకరించింది. అనుకోకుండా ఆమె దృష్టి కిరన్‌ఫొటోపై పడింది. అంతలోకే స్త్రీ సహజమైన సిగ్గు ఆమెను ఆవరించింది. కిరన్ మంచితనాన్ని ఆమె మనస్సులో అభినందించుకుంది. 'పోస్టు' అన్నకేక వినిపించగనే ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఆలోచనలనుండి తేరుకొని పవిట సర్దుకొని, పరిగెత్తుకుంటూ వాకిలిలోకివచ్చింది. పోస్టుమేన్ యిచ్చిన ఉత్తరాలను అందుకొని కూనిరాగాలతో లోనికి వచ్చి ప్రతి జాబునూ చూసింది. అన్నీ కిరన్‌పేరిటేవున్నవి. కనీసం ఒక్కటైనా ఆమెపేరుమీదలేదు. Letters అన్నీ బల్లపై పడేసి దిగాలుగా కూర్చుంది. 'మీనా'పై ఎనలేని కోపం వచ్చింది. కారణం వారం రోజులనుండి కండ్లకు కాగడాలు వేసుకొని జవాబుగురించి వేచివుంది. కాని ఒక్క జాబైనా లేదు యింతవఅకూ. 'మీనా' తార స్నేహితురాలు ఒకేక్లాసులో చదివారు. అన్యోన్యంగా వుండేవారు. ఎటూతోచక కిరన్‌కు

వచ్చిన జాబులన్నీ చింపి చదువుతూ కూర్చుంది. ఆ ఉత్తరాలను చదువుతున్నంతసేపూ కాలేజి జీవితం జ్ఞాపకంవచ్చి చాల ఆనందభరితురాలైంది. 'నరేన్' వ్రాసినజాబు తీసింది. నరేన్ వీళ్లిద్దరికీ ఆప్తమిత్రుడు, కాస్త హాస్యప్రియుడు, కిరన్ క్లాస్‌మేట్. ప్రస్తుతం వరంగల్‌లో టి. టి. ఐ. గా పనిచేస్తున్నాడు రైల్వేలో. చాల మంచివాడు అనుకొంటూ జాబు చదువుతూ కూర్చుంది. ఆమె ముఖకవళికలు మారటం ప్రారంభించాయి. అంతలోకే నొసటపైన చిరుచెమట్లు కూడ పట్టసాగాయి. ఉత్తరం ప్రక్కనపెట్టి దీర్ఘాలోచనలో పడింది. నిజంగా కిరన్ అలాంటివాడా? తనను మోసంచేశాడా? అతని ప్రేమంతా నటనా?........ఏమో మగాళ్లని నమ్మరాదంటారు....యిందుచేతనేమో. అతడు రాగానే ఈజాబు చూపించి అడుగుదామనుకున్నది. అలాగే ఆలోచిస్తూ సోఫాపైనే నిద్రాదేవిఒడిలో లీనమైపోయింది. వెచ్చనిచేతులు చెంపలపై పడగానే ఉలిక్కిపడిలేచి వెనుతిరిగిచూచింది. కిరన్ నవ్వుతూ కనిపించాడు. ఆమెకి చిరుకోపం వచ్చింది. నిజంగా ఈ మగవాళ్ళు ఎంత 'ఇది' అనుకుంది మనస్సులో. అంతలోకే ఏమో! అంతా తన భ్రమేనేమో అనవసరంగా అపోహపడుతున్నానేమో అనుకుంది. కాని ఆజాబు....ఆ జాబేంటి. ఆ ఉత్తరం జ్ఞాపకానికి రాగానే యిక తృంతలేకపోయింది. ఒకవిధమైన బాధపడింది. వంటింట్లోకి వెళ్లి ఎలక్ట్రిక్‌స్టవ్‌పై 'టీ' తయారుచేసి బల్లపైపెట్టి వెళ్లిపోయింది. అక్కడ కిరన్‌కి కాస్త మనస్సు చివుక్కుమంది. ఏమిటి యెప్పుడులేని ఈ వింతప్రవర్తన? అయినా ఈ ఆడవాళ్ళకిది అలవాటేలే చిటికి మాటికి అలగటం. ఎప్పుడూ లేకపోతే యిప్పుడుమాత్రం అలవడకూడదని ఎక్కడుంది....అని అనుకున్నాడు. 'టీ' సేవించి తారదగ్గరకువెళ్లి "తారా అలా బీచ్ వైపు వెళ్దాం తయారుగా" అన్నాడు.

"నేను రాను" — జవాబు.

"రాణిగారు ఈవేళ మామీద అలిగినట్టున్నారే" కారణం తెలుసుకోవచ్చా?"

"......................................."

"తారా ఏమి ఈవేళ అలా వింతగావున్నావు"

"......................................."

"సరే నీ యిష్టం. నేనుమాత్రం వెళ్తున్నా అని డ్రెస్సుమార్చుకొని వెళ్లిపోయాడు. ఆమె మళ్లీ ఆలోచనలో పడింది. అంతులేని ఆలోచనలు తెరలు తెరలుగావచ్చి ఆమె మనస్సును కలవరపరుస్తున్నాయ్. బుర్రను వేడెక్కిస్తున్నాయ్. "పోనీ ఆ జాబు చూపించి అడిగేస్తే తేలిపోతుందిగా" అని ఒక మనస్సు '—లేదు అలా అడుగుతే ఏదో ఓ సాకుచెప్పి తప్పించుకొంటారు అలా వద్దు అడగొద్దు' అని ఆమె అంతరాత్మలు చెప్పాయి. అసలు అపోహ అనేది రానేకూడదు మనిషికి. వస్తే దాని కసలు అంతేలేదు. త్వర త్వరగా ఆమె బట్టలు అవీ సర్దుకుంది పుట్టింటి ప్రయాణానికి. వేరే మార్గం తోచక. అంతలోకే కిరన్ వచ్చాడు. ఈ గడబిడంతా చూసి 'ఎక్కడికి తార ప్రయాణం' అన్నాడు 'యింటికి వెళ్దామని' నిర్వంగా జవాబిచ్చింది. కిరన్‌ని ఎన్నో మాటలు అడగాలనుకుంటుంది. ఏమేమో అనుకుంటుంది. తీరా అతడు రాగానే, అతని ప్రశాంతవదనము చూడగానే ఆ కోపమంతా చప్పున చల్లారిపోతుంది. అతణ్ణి చూడకుండా ఓ క్షణంకూడ వుండలేదు. కాని....అతడు ... అతడు అనుకుంది. అనుకోకుండా ఆమె నేత్రాలు అశ్రుపూరితమైనవి. ఆగకుండా వస్తుంది దుఃఖం. ఆమెలో శక్తి క్షీణించింది. అశ్రువులను ఆపటానికి వెక్కివెక్కియేడ్చింది. కాస్త మనస్సు కుదుటపడి పమిటతో కండ్లు తుడుచుకొంటూ అటుతిరిగిచూసింది. కిరన్ జ్ఞాపకానికి వచ్చి. కిరన్ అప్పటికే లేడు. ఎప్పుడు వెళ్లిపోయాడో అసలే తెలీదు. ఒక అర్ధగంటతర్వాత కిరన్ స్వీట్స్, ఆమె చెల్లెళ్ల గురించి చీరలు చినబావమరదికి బిస్కత్తులు చాక్లెట్లప్యాకెట్లతో, ఆమె దారిప్రయాణానికై తినుబండారాలు, పండ్లు వగైరా తెచ్చి సర్దటంలో ఆమెకి చేయి కలిపాడు. బహుశా ఆమెకు పుట్టిల్లు జ్ఞాపకానికివచ్చి అసాయంత్రం అలా ప్రవర్తించిందేమో అని తనకు తాను సమాధానపరచుకొన్నాడు. రైలుదాకా వెళ్లి ఆమెకు వీడ్కోలిచ్చివచ్చాడు. ఎప్పుడొస్తావు? అని అడగలేదు. నాకు ఇంత అకస్మాత్తుగా అడిగితే శెలవు దొరకదు. నీవు వెళ్లిరా Good Luck అని సాగనంపాడు.

తార పుట్టింటికివెళ్ళి అప్పటికే ఓ పక్షం గడిచింది. ఇంతవరకు ఒక్క జాబైనాలేదు. ఆఫీసునుండి ఇంటికిరాగానే వచ్చిన జాబుల్ని ఆతృతగా చూసేవాడు తార జాబుకోసం. నిరాశతో ఓ వేడినిట్టూర్పు వదిలేవాడు. అతని ప్రేయసి, హృదయరాణి తన ప్రాణంతో ప్రాణం అయిన తారవద్దనుండి ఇంతవరకు ఒక ఉత్తరమైనా లేదు. కారణం ఏమిటో చెప్మా? అని ఆలోచించేవాడు. కాని అంతు చిక్కటంలేదు. ఒకవేళ ఆమె వంట్లో బాగా లేదేమో? ఈ విషయం తలంపుకు రాగానే అతని మెదడు ఇతర విషయాల గురించి యోచించలేదు. రెండు వారాలు ప్రివిలేజి లీవు వ్రాసేసి, ప్రీపాస్ తీసుకొని, సుబ్బమ్మగారికి యిల్లు జాగ్రత అని చెప్పి ఆరాత్రి బండికే బయల్దేరాడు తన అత్తగారిల్లయిన తార పుట్టింటికి. కిరన్ వచ్చాడని తెలియగానే ఆమెలో ఒక నూతన తేజస్సు వచ్చింది. అతడిపైనున్న కోపం, అనుమానం ఆ క్షణంలో మటుమాయమైంది. ఎంతో ఆనందంతో పలుకరించింది. కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చింది. తన కిరన్ చిక్కిపోయాడే అని విచారించింది. కిరన్‌కి యిష్టమైన కూరలు స్వయముగాచేసి భోజనం స్వయంగా వడ్డించింది. కిరన్‌కూడ అక్కడేమేమో అనుకున్నాడు. ఉత్తరాలెందుకు వ్రాయలేదో అడగాలి అనుకున్నాడు కాని చంద్రబింబమువంటి తార మోము, చిలిపికండ్లు చూడగానే అంతా మరిచిపోయాడు. ఏమి అడగలేకపోయాడు. 'ప్రేమ'లోని పరమరహస్యం యిదేనేమో!....

ఆరాత్రి తార మేడమీద పాలుపెట్టి, లైట్ ఆఫ్‌చేసి బెడ్‌లైట్ వెలిగించి, తలుపుదగ్గరగా వేసి అతనిప్రక్కగా కూర్చుంది. రేడియో సన్నగా "ఏమిటో ఈ సంబంధము ఎందుకో ఈ అనుబంధము" అని పాడుతుంది. ఆమెకి నరేన్ వ్రాసిన జాబువిషయం ఎలా తేవాలో ఆ (టాపిక్) ఎలా ఎత్తాలో తెలియక సతమతమౌతుంది. కొద్దిక్షణాలు నిశ్శబ్దంగాగడిచినవి.

ఆమె నొసటిపై బడుతున్న ముంగురులను అతని చేతివ్రేళ్లతో సవరించి. భుజంమీద చేయివేసి ఆమెను మరింత దగ్గరగా లాక్కొని "ఎందుకీ కోపం తార నేనేం తప్పుచేశాను" అనడిగాడు. ఆమెకు యేమి చెప్పాలో అర్థం కాలేదు. ఆ ఉత్తరాన్నిమాత్రం అతనికిచ్చింది దానిని పూర్తిగా చదివి మడతపెట్టి ఆమెకిచ్చాడు. అతనికి నవ్వు అపుదామన్న ఆగకుండా వస్తుంది. కాని ఈ పరిస్థితిలో నవ్వి లాభంలేదనుకొని వచ్చేనవ్వును బలవంతంగా ఆపి నరేన్‌ని పిలిపిస్తాము అతడే జవాబిస్తాడు అని చెప్పాడు. ఆ జాబులోని సారాంశం.

క్షేమ సమాచారాలైన తర్వాత

డియర్ కిరన్ :

నీ బేబి ఎలావుంది. అప్పుడు దాని ఒంట్లో బాగుగాలేదని ఆసుపత్రిలోచేర్చానని వ్రాసావు.

ఇప్పుడు కులాసా? ఇంతకుక్రితం నువ్వు బేబికి తరచూ ఆరోగ్యం చెడిపోతుందని ఇక లాభంలేదని, విడాకులియ్యాలని వ్రాసావు. ఇంతలోకే యింత నిస్పృహ జెందితే ఎలా? నా సలహా అడిగితేమాత్రం ఈ పరిస్థితులలో అన్యాయంచేయడం న్యాయంకాదు. నీకు మెట్రిక్యులేషన్‌నుండి ప్రతిపనిలో అండగా వుంటూవచ్చింది. ఈ సంగతి తెలిస్తే బేబి ఎంత బాధపడుతుందో ఆలోచించావా? అదీ కాక నువ్వుమాత్రం వుండగలవా నీ ప్యారీ బేబిని వదిలి? ఆలోచించు. ప్రస్తుతం యింకేమి చెప్పలేను. తారకుచెప్పి ఆమె మనస్సును బాధపెట్టవద్దు.

జవాబుకొరకు వేచియుంటాను,

నమస్తే.

మరుసటిరోజు ఉదయం 9 గం॥కల్లా నరేన్ హాండ్‌బ్యాగ్‌తోసహా హాజరయ్యాడు కిరన్ అత్తవారింటిముందు. తార అతనిని లోనికి ఆహ్వానించింది. అతడు లోనికి అడుగు వేస్తూనే "ఏమిటమ్మాయ్ తార అంత అర్జంటు పని ఉన్నపాటుగా రమ్మని రాత్రి కిరన్ Control లో చెప్పాడు ఉదయం 2-30 గం॥ 'కాజీపేట్'నుండి బయల్దేరే ట్రైనుతో వచ్చాను. ఇంతకుక్రితమే స్టేషన్‌లోదిగి సరాసరి యిలా వచ్చాను" అన్నాడు అతడు.

"అంతపెద్ద అవసరమేమిలేదులెండి! వేడి నీళ్ళు తోడ్తాను స్నానం ముగించి ఫలహారం తీసుకున్నతర్వాత నిదానంగా మాట్లాడుకోవచ్చు" అంది. తనూహించినట్లు ఎవరూ సీరియస్‌గా లేరని నిర్ధారణ అయిన తర్వాత వాళ్లెప్పుడొచ్చిందీ వగైరాలు తనుకున్నాడు. అంతలోకే తార 'కాఫీ'తెచ్చి బల్లపైవుంచి తీసుకోండి అని చెప్పింది. కాఫీ త్రప్పుతిస్తూ 'కిరన్ లేడా' అని అడిగాడు. 'ఇంతకుక్రితమే ఎటో వెళ్లారు' జవాబిచ్చింది తార. అతడు కప్పు ఖాళీచేయగానే రాముడ్ని (పనివాడు) పిలిచి నరేన్‌కి నీళ్ళు తోడవలసిందిగాచెప్పింది స్నానానికి. ఇతడు ఆమె వివాహంకాక పూర్వం నుంచీ వీళ్లకి పరిచయస్తుడు. 'ఫామిలీఫ్రెండ్' అంటే బావుంటుందేమో. స్నానమయ్యాక ఫలహారం వగైరా ముగించినతర్వాత—

"ఏమిటమ్మా తార విషయం" అని ప్రశ్నించాడు. తార మౌనం వహించింది.

"దేనికి నన్ను పిలిచింది కొంపతీసి వాడు నీతో తగవుగాని పెట్టుకోలేదుగా? అనుమానంగా అడిగాడు.

"లేదు నరేన్ అటువంటిదేమి జరగలేదు" అంటూ అతడు మద్రాసుకు వ్రాసిన జాబు అందించింది జవాబుగా. దానిని శాంతంగా చదివాడు. ఈ జాబే తారహృదయంలో అనుమానబీజం నాటిందని అవలీలగా వూహించాడు. ఆ జాబును మళ్లీ ఓసారి చదివాడు. నవ్వాగలేదు. 'ఇది నేను వ్రాసిన జాబే నాకిస్తున్నావేంటి?' అనడిగాడు యేమి అర్థం కానట్లు.

ఇక తార ఆగలేకపోయింది. అణచుకోలేకపోయింది మనస్సులోని బాధ. అయినా తమాయించుకొని ఆదే శాంతివదనంతో ప్రశ్నించింది 'ఆమె ఎవరు?' అని.

"ఎవరు?" నరేన్.

"అదే ఆ బేబి" బాధతో 'నరేన్ కాస్త నువ్వైనా ఏడిపించక త్వరగా చెప్పు. ఇప్పటికే బాధపడుతున్న నా హృదయాన్ని ఇంకా బాధపెట్టుట నీకు సమంజసంకాదు' అన్నది కట్టలు త్రెంచుకొని పొంగి పొరలివస్తున్న దుఃఖాన్ని అపుకోలేకపోయింది. ఎంత ప్రయత్నించినా లాభంలేకపోయింది. మనస్సు తన అధీనంనుండి తప్పిపోయింది. ధారాపాతంగా కారే కన్నీళ్లను పవిటతో వొత్తుకుంది. ఇక లాభం లేదనుకొని నరేన్ ఆవేశ్తాయిలో 'పిచ్చిపిల్లా ఎందుకలా యేడుస్తున్నావ్. అప్పుడే ఇంత త్వరలో మర్చిపోయావా బేబిని. నీతో కూడా ఎన్నిసార్లు త్రిప్పలేదు. సాయం సమయము షికార్లకని వెళ్లేప్పుడు, కాలేజిబృందముతో 'పిక్‌నిక్స్' వెళ్లేప్పుడు నువ్వు ప్రత్యేకంగా ఎంతో ఆప్యాయంతో నీ చేతిలోనికి తీసుకునేదానివి కిరన్‌వద్దనుండి .... అని యింకా యేమేమొ చెపుతూపోతున్నాడు.

బేబి జ్ఞాపకంవచ్చింది. తారకి దుఃఖమంతా క్షణంలో మాయమైంది. ఇప్పుడు ముఖంలో చిరునవ్వు చిందులాడ్తుంది. ఏడవాలో నవ్వాలో పాల్పోవడంలేదు. పశ్చాత్తాప హృదయంతో బాధపడింది. అనవసరంగా అతనిపై అపోహపడి యిలా చేశానే, యిప్పుడు ఎలా చూపించాలి తన ముఖం అని ఫీలయింది. కిరన్ ప్రేమతో అతని సైకిల్‌కిపెట్టిన పేరు అది 'బేబి చాంపియన్' కిరన్ ప్రవేశిస్తూ "హల్లో నరేన్ యిదేనా రావడం" అని పలుకరించాడు నరేన్ "హల్లో అని మొత్తానికి నీ ప్రియమైన బేబి బలేపని చేసిందిరా బ్రదర్" అన్నాడు.

"ఓహో అయితే....అంటూ చిరునవ్వుతో తారవైపు చూశాడు. కనుకొలకుల్లో నుంచి యితడ్నే చూస్తున్న తార అతడు చూడగానే ఆ వేడిచూపులదాటికి తట్టుకోలేక పలాయనం చిత్తగించింది ప్రక్కగదిలోకి.

అతడూ ఆమెను అనుసరించాడు.

"నన్ను క్షమించవూ" అని దీనంగా అతని కండ్లలోకిచూస్తూ అడిగిందామె.

"ఐనయిపోయాడు కిరన్ కాని బయటికేమాత్రం అలా కనిపించకండా వుండాగా అన్నాడు "నో! నో! పెనాలిటి చెల్లించాలి"అని.

"తప్పతుందా మరి! చెప్పండి దొరగారికేం కావాలో" అంటి చిలిపికళ్లతో తార.

"బస్; ఏకిఏక్ ప్యార్ చాహియే ముజే!" అన్నాడు కిరన్ ఆమెను తన బాహువుల్లోకి లాక్కుంటూ. ఇద్దరూ కిలకిలా నవ్వుకున్నారు. నవ్వుతూ నరేన్‌వున్న గదిలోకి వచ్చారు.

"త్వరగా తయారవ్వగా తమ్ముడూ భోంచేసి అలా ఏదైనా సినిమాకి వెళ్దాం ముగ్గురమూ కలిసి" అన్నాడు నరేన్‌ని వుద్దేశించి కిరన్, తారను ప్రశ్నార్థకంగా చూస్తూ.

"రైట్లో" అన్నట్టు ఆమె తన సమ్మతిని వెళ్లబుచ్చింది కండ్లతో.

★


## ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారంతరు వాసనచూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376 — మదరాసు-1.